# నా స్మృతిపథంలో శ్రీ శోభన్ బాబు

## పి.సత్తిబాబు



( స్వర్గీయ శోభన్ బాబు గారి చివరి సినిమా 'హలో గురూ' కి కో-డైరెక్టర్ గా పనిచేసిన శ్రీ సత్తిబాబు గారు 'కౌముది' కోసం ప్రత్యేకంగా వ్రాసిన జ్ఞాపకాల సంపుటి )



చాలా కాలం క్రితం "ఫెడోరా" అనే ఇంగ్లీష్ సినిమా చూసాను. ఒక అందమైన సినీనటి జీవిత కథ - ఆ సినిమా తన సౌందర్యంతో ప్రేక్షకులని ఉర్రూతలూగించిన ఆ నటీమణి మొహం, ప్రమాదవశాత్తూ అందవికారంగా మారిపోతుంది - అంతకాలం అప్సరసగా కీర్తింపబడిన ఆ నటీమణి, వికారంగా మారిన తన మొహాన్ని ప్రేక్షకులకి చూపించడం ఇష్టంలేక, ఎల్లకాలం ప్రేక్షకుల హృదయాల్లో అందాల రాణిగానే నిలిచిపోవాలనే ఉద్దేశంతో అజ్ఞాతంలోకి వెళ్ళిపోతుంది. ఆవిడ ఆకస్మిక అదృశ్యం సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది..

ఎందుకో శోభన్‌బాబు గారిని తలచుకున్నప్పుడల్లా 'ఫెడోరా' సినిమా జ్ఞాపకానికొస్తుంది. అయితే 'ఫెడోరా'కీ, శోభన్‌బాబు గారికి చాలా తేడా ఉంది. 'ఫెడోరా' లోని హీరోయిన్ అందవికారంగా మారిన తర్వాత తెరమరుగవుతుంది. కాని, శోభన్‌బాబు గారు అందాలతారగా సినీ వినీలాకాశంలో వెలుగుతుండగానే తన నటజీవితానికి తెరదించేశారు.. ఒకప్పుడు పబ్లిక్ ఫిగర్‌గా మీడియాతో ముచ్చటించిన మనిషి, రిటైర్‌మెంట్ ప్రకటించిన తర్వాత ప్రైవేట్ లైఫ్‌కే పరిమితమైపొయ్యారు. ఆయన ఎంత అందగాడో, ఆయన వ్యక్తిత్వం అంతకంటే అందమైంది. మంచితనం, మానవత్వం సంతరించుకున్న వ్యక్తి శ్రీ శోభన్ బాబు. ఆయన ఆఖరుగా నటించిన "హలో గురూ" సినిమాకి కో-డైరెక్టర్‌గా పనిచేసాను. ఆ సినిమాకి వర్క్ చేస్తున్న రోజుల్లో జరిగిన సంఘటనలు నా స్మృతిపథంలో ఇంకా సజీవంగానే ఉన్నాయి. శ్రీ శోభన్ బాబుతో పనిచెయ్యడం ఒక అందమైన అనుభవం.

"హలో గురూ" సినిమాలో శోభన్ బాబుగారితో సుహాసిని, ఆమని హీరోయిన్లుగా నటించారు. ఆలీ, ఆమని ఆ సమయంలో చాలా బిజీగా ఉన్నారు. శోభన్ బాబుగారు రిలాక్స్‌డ్‌గా ఉన్నారు. అయినా సంప్రదాయం ప్రకారం శోభన్ బాబుగారి డేట్స్ తీసుకుని, ఆ తర్వాత ఆమని, ఆలీతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాం. శోభన్ బాబుగారు కరక్ట్‌గా పదిగంటలకొచ్చి ఒంటిగంటకి ఠంచనుగా బ్రేక్ తీసుకుంటారనీ, మరలా మధ్యాహ్నం మూడుగంటలకొచ్చి, ఖచ్చితంగా ఆరుగంటలకి మేకప్ తీసేస్తారనీ, ఆదివారం ఎట్టి పరిస్థితుల్లో షూటింగ్ చెయ్యరనీ, రాత్రిపూట షూటింగ్స్ ప్లాన్ చేస్తే కొంచెం టెన్షన్ పడవలసి ఉంటుందనీ తోటి కో-డైరక్టర్లు చెప్పడం వల్ల, ముందు శోభన్‌బాబు గారిగారితో మాట్లాడిన తర్వాత షూటింగ్ షెడ్యూల్ ప్లాన్ చేద్దామని, "హలో గురూ" డైరెక్టర్ వై.వి.రామ్‌గారితో కలిసి, వారింటికి వెళ్ళాను. మేకప్-మేన్ అప్పారావుగారు మమ్మల్ని గెస్ట్‌రూంలో కూర్చోబెట్టారు. ఆ వెంటనే పని కుర్రాడు జ్యూస్‌లు తెచ్చిచ్చాడు. వచ్చిన వారికి ముందు జ్యూస్‌గానీ, హార్లిక్స్‌గానీ ఇచ్చిన తర్వాతే మిగిలిన విషయాలు మాట్లాడ్డం ఆయన అలవాటని తర్వాత తెలిసింది. శోభన్‌బాబుగారు రాగానే వై.వి.రాం గారు, శోభన్ బాబుగారికి నన్ను పరిచయం చేస్తూ, "సత్తి బాబుగారు కె.ఎస్.ప్రకాశరావుగారి దగ్గర

చాలా కాలం పని చేసారట వారి ఆఖరి సినిమాలకి సత్తిబాబుగారే కో - డైరక్టర్" అని చెప్పారు. కె.యస్.ప్రకాశరావుగారి పేరు వినగానే, వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని, ముఖ్యంగా "తాసిల్దారు గారి అమ్మాయి", "జీవితం" సినిమాల గురించి చాలాసేపు మాట్లాడారు. చివరికి షూటింగ్ షెడ్యూల్ విషయం వచ్చేసరికి, చాలా ఫ్రాంక్‌గా "ప్రస్తుతం నేను బిజీగా లేను. ముందు ఆమని, ఆలీ డేట్స్ తీసుకోండి. వాళ్ళని బట్టి అడ్జస్ట్ చేస్తాను" అన్నారాయన. ఎంతో ఎదిగిపోయిన వ్యక్తి, అంత ఒదిగిపోయి మాట్లాడేసరికి మేం ఆశ్చర్యపోయాం.! ఆ క్షణమే శోభన్ బాబుగారంటే నిజమైన గౌరవం ఏర్పడింది.

మా షూటింగ్ మొత్తం మద్రాస్‌లోనే జరిగింది. ఆలీ, ఆమని హైదరాబాద్ నుంచి వచ్చేవాళ్ళు. వారికున్న ప్రీవియస్ కమిట్‌మెంట్స్‌ని బట్టి డేట్స్ ఇచ్చారు. చెయ్యాల్సిన సీన్స్ ఎక్కువ, వారి డేట్స్ తక్కువ. అందుకని శోభన్‌బాబుగారి కాంబినేషన్ లేని సీన్స్ త్వరగా మొదలు పెట్టేవాళ్ళం. పదింటికి శోభన్‌బాబుగారు జాయిన్ అయ్యేవారు. ఒకసారి అలాగా ఆలీతో సీను తీస్తుండగా, శోభన్ బాబుగారి అసిస్టెంట్ వచ్చి "శోభన్‌బాబుగారు వచ్చార"ని చెప్పాడు. నేను వెంటనే శోభన్ బాబుగారి దగ్గరకెళ్ళి విష్ చేసి, "మీరొచ్చే లోపల ఆలీ మీద ఒక సీను ప్లాన్ చేసాం. పది నిముషాల్లో కంప్లీట్ అవుతుంద"ని చెప్పాను. "డోంట్ వర్రీ. కారీ ఆన్ విత్ యువర్ షెడ్యూల్డ్ వర్క్. ఐ యాం ఎట్ యువర్ ప్రజెన్స్ అని తెలియజెయ్యడానికే కబురు చేసాను. డోంట్ బి హర్రీ. టేక్ యువర్ ఓన్ టైం" అని చిరునవ్వుతో అన్నారు. నేను ఆశ్చర్యపొయ్యాను. హీరో, హీరోయిన్లు రాగానే, వారి వర్క్ చెయ్యక పోతే అలిగి ఇబ్బందులు పెట్టే కల్చరున్న ఇండస్ట్రీలో, అంత సంస్కారవంతంగా ప్రవర్తించడం ఆయనకే చెల్లింది. ఆలీ వర్క్ మీద కాన్సంట్రేషన్ చెయ్యడం వల్ల, ఒక్కొక్కసారి మధ్యాహ్నం వరకూ శోభన్ బాబుగారి షాట్ రాకపోయినా ఏ మాత్రం డిస్టర్బ్ అయ్యేవారుకాదు. లొకేషన్‌కి దూరంగా నీడలో కూర్చుని, ఎక్కువగా ఒంటరితనం ఎంజాయ్ చేస్తుండే వారు. ఆయన్ని షాట్‌లోకి పిలవడానికి ఎక్కువగా నేనే వెళ్ళేవాడిని. యధావిధిగా పిలవడానికి ఒకసారి వెళ్ళినప్పుడు, "సత్తిబాబుగారూ! వై.వి.రామ్‌గారు ఫస్ట్‌టైమ్ డైరక్షన్ చేస్తున్నారు. మీరు, ఆయన ప్రక్కన ఉండండి! మర్యాద కోసం షాటు షాటుకీ మీరొచ్చి పిలవ వలసిన అవసరంలేదు. మీ అసిస్టెంటుని పంపించండి చాలు. నేనేమీ అనుకోను" అన్నారు. ఇది కూడా ఆశ్చర్యపడే సంఘటనే!


శోభన్‌బాబుగారి చివరి సినిమా 'హలో గురూ' నుంచీ ఒక దృశ్యం

మాకిచ్చిన డేట్స్ పూర్తిచేసుకుని ఆ సాయంత్రం ఫ్లైట్‌కి, ఆలీ హైదరాబాద్ వెళ్ళిపోతున్నాడు. ఆఖరిక్షణంలో హైదరాబాదులో షూటింగ్ కేన్సిల్ అయిందని ఫోన్ రావడంతో, మర్నాడు కూడా తన వర్క్ చేసుకోవచ్చన్నాడు ఆలీ. అయితే, శోభన్‌బాబుగారి కాంబినేషన్‌లోనే ఆలీ సీన్స్ మిగిలి ఉన్నాయి. మరునాడు ఆదివారం, ఆరోజు శోభన్‌బాబుగారు పనిచెయ్యరు. కొన్ని సంవత్సరాలుగా పనిచెయ్యడం లేదు కూడా! "అడిగి లేదనిపించుకోవడం ఎందుకు. వదిలేద్దాం" అనుకున్నాం. "ఒక్కసారి అడిగి చూడండి! రేపు ఒక్కరోజు చేస్తే, చాలా వర్క్ కవర్ చెయ్యొచ్చు" అని ఆలీ బలవంతం చేసాడు. ఆలోచించి, చివరికి అడ్జస్ట్‌మెంట్ బాధ్యతని ఆలీ మీదే పెట్టాం. అటూ ఇటూ తిరిగి ఆ బాధ్యత తన మీద పడ్డందులు ఆలీ కంగారు పడ్డాడు. శోభన్ బాబుగారు, ఆలీతో చాలా సరదాగా ఉండేవారు. ఆలీ కూడా ఆయన దగ్గర కూర్చుని జోకులు చెప్పి నవ్విస్తుండేవారు. అలాగే "హల్లో గురూ" సినిమాలో ఆలీ వేసిన కేరక్టర్ పంధాలో వెళ్ళి "రేపు ఎడ్జస్ట్‌మెంట్ అడుగు" అని ఆలీని ఒప్పించాం. ఆలీ భయపడుతూ ఆయన దగ్గరకెళ్ళి, బలవంతంగా నవ్వు తెచ్చుకుని, "హల్లో గురూ! రేపు సరదాగా షూటింగ్ చేద్దామా" అని అడిగాడు. శోభన్ బాబుగారు నువ్వుతూ, "నువ్వు హైదరాబాద్

వెళ్ళిపోతున్నావ్ గదరా" అన్నారు. "ఇంతకీ నాదగ్గరకి నిన్నెవరు పంపించారు" అని అడిగారు. ఆలీ, వై.విరామ్ గారిని, నన్నూ చూపించాడు. మాకు పరిస్థితి అర్థం అయింది అనవసరంగా ఆయన్ని డిస్టర్బ్ చేసి, మేం డిస్టర్బ్ అయ్యామేమో అని ఫీలవుతూ వెళ్ళాం.

"రేపు వర్క్ చేస్తాను. షూటింగ్ పెట్టుకోండి" అని ఉపోద్ఘాతాలేమీ లేకుండా సూటిగా అన్నారు. మేం సంభ్రమానికి లోనయ్యాం! శోభన్ బాబుగారు అంత తేలిగ్గా ఒప్పుకుంటారని ఏమాత్రం ఊహించలేదు. "సారీ సర్! మా కోసం మీ ప్రిన్సిపుల్‌ని బ్రేక్ చేస్తున్నారు" అన్నాము, షాక్‌నుంచి తేరుకుంటూ.

"బాగా బిజీగా వున్న రోజుల్లో, ఫామిలీతో గడపడానికి ఆదివారం పని చెయ్యకూడదని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు ఎక్కువగా ఇంట్లోనే వుంటున్నాను. రేపు ఒక్కరోజు పని చెయ్యడంవల్ల ఆలీకి, మీ ప్రొడ్యూసర్‌కి కలిసొస్తుంది. పైగా ఆలీ ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాడు. వాడి కెరీర్‌కి ప్రతిరోజూ విలువైందే! ఈ ఆదివారం పనిచెయ్యడం వల్ల నాకు పోయేదేమీ లేదు" అన్నారు చాలా కేజువల్‌గా. ఎదుగుతున్న ఒక సాటి నటుడికి సహకరించడానికి, ఎన్నో ఏళ్ళుగా పాటిస్తూ వచ్చిన ప్రిన్సిపుల్‌ని ప్రక్కన పెట్టిన శోభన్‌బాబుగారి మీద గౌరవం రెట్టింపయింది.

"హలో గురూ" బ్యాలన్స్ వర్క్ ప్లాన్ చేసిన సమయంలో, దర్శకులు వై.వి.రామ్‌గారు పర్సనల్ పని మీద వైజాగ్ వెళ్ళి, అక్కడ వైరల్ ఫీవర్ ఎటాక్ అవడంతో హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. శోభన్‌బాబుగారు, ఆమని, ఆలీ, నిరోషాల డేట్స్ కన్‌ఫర్మ్ అయ్యాయి. ఆ డేట్స్ పోతే, చాలాకాలం ఎదురు చూడవలసి ఉంటుంది. అయితే బ్యాలన్స్ వర్క్‌ని నాతో కంప్లీట్ చేయించమని వై.వి.రామ్ గారు లెటరు పంపించారు. నిర్మాత కొండ్రెడ్డి క్రిష్ణారెడ్డిగారు ఆ లెటర్ తీసుకొచ్చి నాకిచ్చారు. "వర్క్ కంప్లీట్ చెయ్యడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ ఒక్కసారి శోభన్‌బాబు గారి దగ్గరకెళ్ళి డైరక్టరుగారు హాస్పిటలైజ్ అయ్యారు. ఆయన ప్లేస్‌లో సత్తిబాబు డైరక్షన్ చేస్తున్నారని చెప్పండ"ని అన్నాను.

"డైరెక్టర్‌గారు మిమ్మల్ని చెయ్యమన్నారు. ప్రొడ్యూసర్‌గా నేను కూడా మిమ్మల్నే చెయ్యమంటున్నాను. ఇంకా శోభన్‌బాబు గారికి చెప్పవలసిన అవసరం ఏముంది" అని క్రిష్ణారెడ్డిగారు వాదించారు.

"ముందుగా ఈ విషయం తనకి తెలియపరచలేదని శోభన్‌బాబు గారు ఫీలయితే వర్క్ డిస్టర్బ్ అవుతుంది. అసలే ఫినిషింగ్ కాల్ - షీట్స్. ఎందుకు రిస్క్ తీసుకోవడం" అని ఒప్పించాను.

క్రిష్ణారెడ్డిగారు శోభన్‌బాబుగారి దగ్గరకెళ్ళి "హెల్త్ ప్రోబ్లం వల్ల డైరెక్టర్ గారు షూటింగ్‌కి రాలేకపోతున్నారు" అని చెప్పగానే," అయితే సత్తిబాబుగారితో చేయించండి! He is a capable Technician" అని శోభన్‌బాబుగారే సలహా ఇచ్చారంట .

ఈ విషయం క్రిష్ణారెడ్డిగారు నాతో చెప్పినపుడు ఒళ్ళు పులకించింది. శోభన్‌బాబుగారిలాంటి గొప్పనటుడి నుంచీ పరోక్షంగా అంత కాంప్లిమెంట్‌ని అందుకున్నందుకు గొప్ప అవార్డు లభించినంత ఆనంద పడ్డాను. అయిదురోజులు జరిగిన షూటింగులో ఎపుడూ ఒక సూచనగానీ, సలహాగానీ ఇవ్వలేదు. ఒక ఫుల్ ప్లెడ్జెడ్ డైరెక్టర్‌ని ఎలా గౌరవిస్తారో, అలానే నన్ను గౌరవించారు. శోభన్‌బాబుగారిచ్చిన సహకారం ఎప్పటికీ మరిచిపోలేను.

వై.వి.రామ్‌గారు హాస్పిటల్ నుంచీ డిస్చార్జ్ అయ్యి, మద్రాస్ వచ్చిన తర్వాత శోభన్‌బాబుగారు నాకెలా కో ఆపరేట్ చేసారో చెప్పాను. అప్పుడాయన ఒక కొత్త విషయం చెప్పారు. అప్పట్లో "కాలేజ్ స్టూడెంట్" అనే మరో సినిమాకి నేను కో - డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. ఆ సినిమా షూటింగ్ హైద్రాబాద్‌లో జరుగుతుండేది. దాని కారణంగా కొన్ని సందర్భాల్లో "హల్లో గురూ" షూటింగ్ మిస్ అవుతుండేవాణ్ణి. ఒక సారి నేను లేని సమయంలో వై.వి.రామ్ గారికి శోభన్ బాబుగారు సలహా ఇచ్చారంట, భవిష్యత్తులో మీకు సినిమాలు వస్తే, సత్తిబాబుగారిని మాత్రం మిస్ చేసుకోవద్దు. ఆయన డైరెక్టర్ అయ్యేవరకూ, ఆయన సర్వీసెస్ మీరు యుటిలైజ్ చేసుకోండి" అని. నేను నమ్మలేకపొయ్యాను. నిజానికి నామీద అంత మంచి అభిప్రాయం ఏర్పడేంతగా నేనేమీ చెయ్యలేదు. ఏ కోణంలోంచి నన్ను అబ్జర్వ్

చేసారో నాకు తెలియదు. రెండుసార్లు నన్ను పరోక్షంగా అభినందించినందుకు శోభన్‌బాబుగారికి కృతజ్ఞతలు తెలియజెయ్యాలని చాలాసార్లు అనుకున్నాను. కానీ తెలపలేకపొయ్యాను. అది నా బలహీనతతో, మొహమాటమో ఇప్పటికీ తెలియదు.

1995 నాటికి నేను సినిమా ఇండస్ట్రీకి వచ్చి 22సంవత్సరాలు నిండాయి. ఎపుడూ ఏ హీరోతోనూ ఉబలాటపడి స్టిల్ తీయించుకోలేదు. ప్రత్యేకంగా నేను అభిమానించే హీరో అంటూ ఎవరూ లేరు. "గౌరవించు, గౌరవం అందుకో" అనే పద్ధతిలోనే అందరితో నా సంబంధాలు కొనసాగేవి. అయితే శోభన్‌బాబుగారంటే ఎందుకో చెప్పలేని గౌరవం, అభిమానం కలిగాయి."హలోగురూ" ఆఖరి షూటింగ్ రోజున "సార్! మీతో ఒక స్టిల్ దిగాలనుంది" అని శోభన్‌బాబుగారిని అడిగాను. "ఓ ష్యూర్ రండి" అని భుజం మీద చెయ్యివేసి, సోఫాలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుని ఫోటో దిగారు. ఆఫోటోని ఎంతో పదిలంగా దాచుకున్నాను.

పేకప్ అయిన తర్వాత శోభన్‌బాబుగారు వెళ్ళిపోతూ, "వెళ్ళొస్తాను సత్తిబాబుగారూ! నాకు సూటబుల్ స్టోరీతో వస్తే, మీ డైరెక్షన్‌లో ఏక్ట్ చేస్తాను" అన్నారు.

"I am very much greatful to you sir" అన్నాను.

"IT's an open offer for you! Best of luck" అని వెళ్ళి పొయ్యారు. ఆ తర్వాత ఆయన రిటైర్‌మెంట్ ప్రకటించారు. నేను సినిమాలు డైరెక్షన్ చెయ్యాలని ఆశిస్తే, టెలీఫిలిమ్స్‌కీ, సీరియల్స్‌కీ డైరెక్షన్ చేసే అవకాశాలు వచ్చాయి. అవే మహాప్రసాదం అనుకుని, ఏటికి ఎదురీదుతూ సినీ ప్రపంచంలో కొనసాగుతూనే ఉన్నాను.

1997 సంవత్సరంలో మద్రాస్ నుంచీ హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను. ఆ తర్వాత ఎన్నోసార్లు మద్రాస్ వెళ్ళాను. ఎప్పుడూ శోభన్‌బాబుగారిని కలవలేదు. అయితే శోభన్ బాబుగారి గురించి టాపిక్ వస్తే మాత్రం ఏదో తెలియని ఎక్సైట్‌మెంట్‌కి లోనయ్యి, "హలో గురూ" సినిమా షూటింగ్ సందర్భంలో ఆయనతో పాలు పంచుకున్న అనుభవాలని వివరిస్తుంటాను. ఆ అనుభూతి ఇప్పటికీ కొత్తగానే ఉంటుంది.

మన జీవిత గమనంలో ఎంతో మంది వ్యక్తులు తారసపడతారు. అందులో కొందరిని వెంటనే మర్చిపోతాం. ఇంకొందరు సందర్భానుసారం గుర్తుకు వస్తారు. కొందరు మన హృదయంలో బలమైన ముద్రవేసి, శాశ్వతంగా నిలిచిపోతారు.

నాకు సంబంధించినంత వరకూ శోభన్‌బాబుగారు మూడో కోవకి చెందిన వ్యక్తి రెండు సంవత్సరాల క్రితం "షిర్డిసాయిబాబా" మీద 30 నిముషాల వీడియో ఆల్బమ్ చేసాను. దాంట్లో శ్రీ మురళి మోహన్ ఒక ముఖ్యపాత్రలో నటించారు. సాయంత్రం బ్రేక్‌లో మేమిద్దరం ముచ్చటిస్తున్న సందర్భంలో శోభన్‌బాబుగారి గురించి టాపిక్ వచ్చి, ఆయన మంచితనం, సంస్కారాల గురించి పొగుడుతూ, "నేను శోభన్‌బాబుగారి అజ్ఞాత అభిమానిని" అన్నాను. దానికి మురళీమోహన్‌గారు స్పందిస్తూ, "నేను కూడా శోభన్‌బాబు గారి అభిమానినే! నేను డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి దిగుదామనుకుంటే వారించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చెయ్యమని ప్రోత్సహించింది ఆయనే" అన్నారు.

తోటివారు ఎదగాలనీ, బాగుపడాలనీ మనఃస్ఫూర్తిగా ఆశించే వ్యక్తి శ్రీశోభన్‌బాబు. ఆయన మరణ వార్త వినగానే దిగ్భ్రాంతికి లోనయ్యాను. ఏదో అశాంతి, వైరాగ్యంతో మనసంతా నిండిపోయింది. చేస్తున్న ఎడిటింగ్ వర్క్‌ని ఆపేసి ఇంటికి వచ్చి, గదిలో ఒంటరిగా గడిపేసాను. గుండెలో పదిలంగా, సజీవంగా వున్న ఒక్కొక్క అనుభవం జ్ఞాపకానికొచ్చి గొంతు గడ్డకట్టుకుపోయింది. టీ.వీ.లో శోభన్‌బాబుగారి గురించి వస్తున్న ఇంటర్వ్యూలు చూడలేదు. మర్నాడు పేపర్లో ఆయన గురించి వచ్చిన వార్తలూ చదవలేదు. నిర్జీవంగా వున్న శోభన్‌బాబు గారిని చూడటానికీ, ఆయన మరణ వార్తలు వినడానికీ మనసు అంగీకరించలేదు. ఒక్క సినిమాకి ఆయనతో పనిచేసిన నేనే ఇంత ఆవేదనకిలోనయ్యానంటే, శోభన్‌బాబుగారిని అమితంగా అభిమానించి, ప్రేమించే సన్నిహితులు ఇంకెంత వేదనకి గురయ్యివుంటారో? ఇంతమంది గుండెల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న శోభన్‌బాబుగారు మరణించినా ఎప్పటికీ జీవించే ఉంటారు.